నేటి నిజం
తెలుగు దినపత్రిక
website2:www.netinijam.com2
ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433
E-mail : netinijam93@gmail.com



**నేటి కందం- నేటికి అందం**

సంక్రాంతి పర్వదినమున
సంక్రమణము జరుగు మీకు సకల శుభములున్
సంక్రాంతి పురుష దొసగుత
సంక్రామము నెరుగనట్టి శాంతిని జయమున్

(14-1-25 సంక్రాంతి పండుగ)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

ఇండ్లముందు ఎన్నెన్నో
ఇష్టమైన ముగ్గులు
సంక్రాంతి సంబరాల
సందడితో నిగ్గులు
పాతపోయి కొత్తదనం
ప్రకృతిలో సంక్రమణం
ప్రజల్లోనా వస్తే మంచి
ప్రగతికై మార్పు ఘణం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ | మంగళవారం 14-1-2025 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :31 | సంచిక:122 | పేజీలు:6 | వెల: రూ.1/-

# ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభమైన మహా కుంభమేళా

## త్రివేణి సంగమం వద్ద తొలి రోజు 50 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు



లక్నో జనవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉత్తరప్రదేశ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. తొలి రోజు ఉదయం గంగా యమునా సరస్వతి నదులు కలిసిన త్రివేణి సంగమం వద్ద దాదాపు 50 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక మంది సమ్మేళనమైన కార్యక్రమంగా ఈ మహా కుంభమేళా రికార్డుల్లోకి ఎక్కనుంది. ఈ కుంభమేళాకు దాదాపుగా 45 కోట్ల మందికిపైగా భక్తులు తరలివస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇది అమెరికా, రష్యా దేశాల జనాభా కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం. కుంభమేళా ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. అయితే ఇప్పుడు జరిగేది మహా కుంభమేళా. ఈ మహా కుంభమేళా 144 ఏళ్లకు ఒకసారి జరుగుతుంది. ఇవాళ ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఈ మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ సర్కారును ఆర్థికంగా ఎంతో బలోపేతం చేయనుంది. ఈ 45 రోజుల మహా కుంభమేళా నిర్వహణ కోసం యూపీ సర్కారు రూ.7 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. అయితే మహా కుంభమేళాకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తే.. యూపీకి ఆదాయం రూపంలో దాదాపు రూ.2 లక్షల కోట్లు వచ్చే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ భక్తులు 45 కోట్ల మంది రాకపోయినా 40 కోట్ల మందే వచ్చినా.. ఒక్కో భక్తుడు రూ.5 వేల చొప్పున ఖర్చు చేసినా రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉన్నదని వారు చెబుతున్నారు. ఇక భక్తులు రూ.10 వేల చొప్పున ఖర్చు చేస్తే మొత్తం రూ.4 లక్షల కోట్ల ఆదాయం సమకూరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కాగా 2019లో జరిగిన అర్ధ కుంభమేళా ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ చెప్పారు. ఆ కుంభమేళాకు 24 కోట్ల మంది భక్తులు వచ్చారు. ఐదేళ్ల క్రితం 24 కోట్ల మంది భక్తులు వస్తేనే రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం వచ్చినప్పుడు.. ఈసారి 40 కోట్ల మంది కంటే ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రూ.2 లక్షల కోట్ల ఆదాయం రావడం అసాధ్యమేమీ కాదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.

# మహా కుంభమేళా భారతదేశ నిత్య నూతన ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, నమ్మకాన్ని, సామరస్యాన్ని పెంపొందించే ఉత్సవం: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 13:మహా కుంభమేళా 2025 ప్రారంభం సందర్భంగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రయాగ్ రాజ్ లోని ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ విలువలను, సంస్కృతిని ఆదరించే కోట్లాది మందికి ఇది చాలా ప్రత్యేకమైన రోజు అని శ్రీ మోదీ పేర్కొన్నారు. మహా కుంభమేళా కాలానికి అతీతమైన భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని, నమ్మకాన్ని, సామరస్యాన్ని పెంపొందించే ఉత్సవమని అన్నారు.

”భారతీయ విలువలు, సంస్కృతిని ప్రేమించే కోట్లాది ప్రజలకు ఇది ఒక ప్రత్యేకమైన రోజు! ప్రయాగరాజ్‌లో మహా కుంభ్ 2025 ప్రారంభం అయింది. విశ్వాసం, భక్తి, సంస్కృతుల పవిత్ర సంగమంలో అసంఖ్యాక ప్రజలను ఏకం చేస్తోంది. మహా కుంభ్ భారతదేశ నిత్యమైన ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, విశ్వాసం సామరస్యాన్ని ప్రోత్సహిస్తుంది”.

“ప్రయాగరాజ్‌లో అనేక మంది వచ్చి పుణ్యస్నానం చేసి ఆశీర్వాదాలు పొందుతుండటం చూసి నాకు ఆనందంగా ఉంది. ఈ ఆధ్యాత్మిక ఉత్సవం యాత్రికులకు, పర్యాటకులకు అద్భుతమైన అనుభవం అందించాలని కోరుకుంటున్నాను”.

“పవిత్ర పుణ్యక్షేత్రమైన ప్రయాగ్ రాజ్ లో నేటి నుంచి పుష్య పౌర్ణమి సందర్భంగా పవిత్ర స్నానంతో మహా కుంభమేళా ప్రారంభమైంది. మన విశ్వాసం, సంస్కృతితో ముడిపడి ఉన్న ఈ దివ్య సందర్భంలో భక్తులందరికీ హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను. భారతీయ ఆధ్యాత్మిక ఈ సంప్రదాయ గొప్ప పండుగ మీ జీవితాల్లో కొత్త శక్తిని ఉత్సాహాన్ని నింపాలని కోరుకుంటున్నాను” అని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్‘ లో పోస్ట్ చేశారు.

# ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 13:తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భోగి పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపుతూ, కొత్త కాంతులు పంచే భోగి మంటలు ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రజా పాలన తెచ్చిన మంచి మార్పులతో అన్ని వర్గాలకు అంతా మంచి జరగాలన్నారు.

రైతు భరోసాను రూ.12 వేలకు పెంచటంతో పాటు వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం, ఆహార భద్రతను అందించే కొత్త రేషన్ కార్డులు, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతి పండుగ నాంది పలుకుతోందని అన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికీ చేరాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి కల్పన, పారిశ్రామిక రంగాలన్నింటా తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగమనం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్వేచ్ఛా సౌభాగ్యాలతో



ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలని అన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కిషన్ రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు..

## -స్పెషల్ గెస్ట్‌గా ప్రధాని మోదీ, మెగాస్టార్ చిరంజీవి

హైదరాబాద్, జనవరి 13:దేశ రాజధాని ఢిల్లీలో ఈరోజు (సోమవారం) సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తన నివాసంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సంబరాల నేపథ్యంలో తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా కిషన్ రెడ్డి ఇంటిని అలంకరించారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు.

కాగా, ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. వీరితో పాటు పలువురు కేంద్రమంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్



రెడ్డి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి, చిరంజీవికి ఘనస్వాగతం సాదర స్వాగతం పలికారు. ఈ వేడుకల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు.

# భోగి వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్..



హైదరాబాద్ జనవరి 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. మకర సంక్రాంతికి ముందు రోజు వచ్చే భోగి పండుగను తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. పిల్లలు, పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేసి సందడి చేశారు. సామాన్య ప్రజలతోపాటు సినీ, రాజకీయ ప్రముఖులు సైతం భోగి వేడుకల్లో పాల్గొన్నా రు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఇంట్లో భోగి సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , హరీశ్‌రావు పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్, పట్లోల్ల కార్తిక్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. భోగి మంటల వేడుకలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మరియు పట్లోల్ల కార్తిక్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి - మంత్రి సీతక్క

హైదరాబాద్, జనవరి 13:కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనదారలు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. బీర్లకు, బార్లలో ఖర్చు చేస్తున్నారు.. కానీ ప్రాణానికి రక్షణనిచ్చే హెల్మెట్ కోసం మాత్రం ఖర్చు చేయడం లేదని అన్నారు. జిల్లాలో గత ఏడాదిలో 213 మంది ప్రమాదాల్లో మృతి చెందారని చెప్పారు. మనతోపాటు మనలను నమ్ముకున్న వాళ్లు ఉంటారని, అందుకే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు పాటించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

వాహనాలు ఎక్కి డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సీతక్క సూచించారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వెల్లడించిందన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మితిమీరి వేగంతో వెళ్లరాదు అని పేర్కొన్నారు. దీంతో పాటు వాహనదారులు రోడ్డు మీదకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు తగ్గిపోతాయని చెప్పారు.

# తెలంగాణలో చరిత్రాత్మక పథకాలు అమలు చేస్తున్నాం- ఉప ముఖ్యమంత్రి భట్టి

## -ఇలాంటివి దేశంలో ఎక్కడా అమలు కావడం లేదు
## -డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం, జనవరి 13:తెలంగాణలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణం, ధాన్యం బోనస్ చారిత్రాత్మకమైన పథకాలు తెలంగాణ సర్కార్ ఇస్తుందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు 45 వేల కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతు భరోసాకు రూ.19 వేల కోట్ల రూపాయలు ఆత్మీయ భరోసాకు 2 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెటాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రజలకు ఇచ్చిన



హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రతి స్కీంలో కన్ఫ్యూజ్ లేదన్నారు. పథకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే, ఉపాధి హామీ పథకంలో సభ్యులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులు అని వెల్లడించారు. ఇందులో సెంట్ భూమి లేని వారికి వర్తిస్తుంది అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన స్పష్టత ప్రభుత్వం దగ్గర ఉంది. అధికారులు ఇందిరమ్మ కమిటీలు సమన్వయంతో పని చేయాలి అని సూచించారు. గ్రామాల్లో ముడు చోట్ల ఫ్లెక్సీలని ఏర్పాటు చేయాలని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అక్రమాలకు తావివ్వొద్దు.. మంత్రి కోమటిరెడ్డి

ఖమ్మం, జనవరి 13: త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటనలు ఉంటాయని, ఇందిరమ్మ ఇళ్లపై ఆరా కూడా తీస్తారన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అక్రమాలు జరగకుండా చూడాలన్నారు. భవనాలున్న వారికి ఇళ్లు ఇస్తే మొదటి బాధ్యులు కలెక్టర్ అవుతారని తేల్చి చెప్పారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో నేడు జరిగిన ఇందిరమ్మ ఇళ్ల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ? అర్హులైన వారికి ఇళ్లు రావాలన్నారు. అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సి వుంటుందని తేల్చి చెప్పారు. అధికారులు, సిబ్బంది అలసత్వం ఉండొద్దని అంటూ, గ్రామాలు మీ ఇళ్లు అనుకుని పని చేయండని మంత్రి సూచించారు.

అలాగే, ప్రజాపాలనలో ప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ఈ ప్రభుత్వాన్ని గెలిపించారని కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి తెలిపారు. వారి కోసం ఒక్కొక్కటిగా పని చేసి పెడుతున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లాంటి కార్యక్రమాలు ఈనెల 26 నుంచి అమలు చేస్తామన్నారు. ప్రతి అర్హుడైన పేదవాడికి న్యాయం జరిగేలా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. అర్హుడైన ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తామన్నారు. రెవెన్యూ మంత్రి కూడా ఖమ్మం జిల్లా వ్యక్తేనని, ఆయన దగ్గర ఉండి పేదలకు ఇందిరమ్మ ఇళు ఇస్తారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

# సీనియర్ జర్నలిస్టు అనిల్‌కుమార్ హఠాన్మరణం.. సంతాపం తెలిపిన సీఎం

హైదరాబాద్, జనవరి 13:సీనియర్ జర్నలిస్టు అనిల్‌కుమార్ (55) హఠాన్మరణం చెందారు. కర్ణాటకలోని గోకర్ణ శ్రీ మురుదేశ్వర ఆలయంలో దర్శనం ముగించుకుని ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగొస్తుండగా ఛాతీలో నొప్పితో కుప్పకూలాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులు హుటాహుటిన భత్కల్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ తుదిశ్వాస విడిచారు. సీనియర్ జర్నలిస్టు అనిల్ కుమార్ అనేక ప్రసిద్ధ దినపత్రికల్లో జర్నలిస్టుగా సుదీర్ఘంగా సేవలందిచారు. 1994 లో ‘న్యూస్ టైమ్’ రిపోర్టర్‌గా కెరీర్ ఆరంభించిన ఆయన.. టీఎన్ఐ చెన్నై, ఏపీ టైమ్స్, డైలీ హిందీ మిలాప్ వంటి ప్రముఖ దినపత్రికల్లో పనిచే శారు. స్వతంత్ర వార్తలో బ్యూరో ఇన్‌చార్జిగా 12 ఏళ్లపాటు సేవలందించారు. ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో ఆరేళ్లు పనిచేశారు. అనంతరం 2022లో తెలంగాణ టుడే దినపత్రికలో చేరారు. హైదరాబాద్‌లోని సఫిల్‌గూడలో అనిల్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య ఆషా, ఇద్దరు పిల్లలు రష్మి, రాహుల్ ఉన్నారు.

సీఎంగ్భ్రాంతి

సీనియర్ జర్నలిస్టు అనిల్‌కుమార్ ఆకస్మిక మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జర్నలిస్టుగా అనిల్ కుమార్ పత్రికారంగానికి చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు.

సీనియర్ జర్నలిస్టు అనిల్ కుమార్ ఆకస్మిక మృతి పట్ల మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి ధైర్యం చెప్పారు.

# రూ.35 కోట్లతో అన్నదానం సత్రం- మంత్రి పొన్నం

## -రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
## -మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటు చేస్తాం
## -వేములవాడ రాజన్నకు ప్రత్యేక పూజలు
## -పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు, అధికారులు

రాజన్న సిరిసిల్ల, జనవరి 13:(నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌లు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. విప్ ఆది శ్రీనివాస్ తోపాటు ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నిత్య అన్నదాన సత్రం ఏర్పాటుకు ముఖ్యమంత్రి రూ. 35 కోట్లను మంజూరు చేస్తూ జీవో కూడా విడుదల చేశారని చెప్పారు. అన్నదాన సత్రం భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అన్నదాన నిరంతరం కొనసాగడానికి ట్రస్ట్ లో ఇప్పటికే రూ. 20 కోట్లు ఉన్నాయని, దానిని వంద కోట్లు చేసే బాధ్యత జిల్లా ప్రజా ప్రతినిధులది, అలాగే ఈ ప్రాంత ప్రజలది అన్నారు.

రూ.40 లక్షలు విరాళం ప్రకటించిన మంత్రి

నిత్యాన్నదానానికి తమ కుటుంబం తరుఫున రూ. 40 లక్షలను విరాళంగా ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రకటించారు. రాజరాజశ్వర స్వామి భక్తులు కూడా విరాళం ఇవ్వాలని కోరారు. దేవస్థానం పేరు మీద బ్యాంక్ అకౌంట్ లో రశీదులు తీసుకొని విరాళాలు ఇవ్వాలని సూచించారుర. స్థానిక ఎమ్మెల్యేలు, ఈవోనీ కలిసి విరాళాలు ఇవ్వొచ్చు అని తెలిపారు.



వేములవాడ రాజన్న అన్నదాన ట్రస్ట్ కి సంబంధించి విరాళాలు ఏవి ఇచ్చిన సరే.. రైతులు బియ్యం, కూరగాయలు కూడా ఇవ్వొచ్చు అని ఆయన తెలిపారు. తాము హైదరాబాద్ లో డోనర్స్ ను కలుస్తామన్నారు. వేములవాడ దర్శనంలో కోడె టికెట్, అభిషేకం టికెట్ తీసుకొని దర్శనం చేసుకున్నామన్నారు.

టీటీడీలా..

టీటీడీ దేవస్థానం మాదిరిలా అందరికీ టికెట్ తీసుకుని ప్రత్యేక దర్శనం చేసుకోవచ్చు మంత్రి అన్నారు. శ్రీశైలంలో ఉన్నట్లే మ్యూజికల్ ఫౌంటెన్ వేములవాడలో లార్డ్ శివ ఉండేలా చేస్తున్నామని వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం గర్భగుడిలో కొలువుదీరిన శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు అధికారులు ప్రముఖులకు ఆశీర్వచనం గావించి స్వామివారి చిత్రపటం, మహాప్రసాదాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. వారి వెంట ఆలయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జపాన్‌లో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ

న్యూఢిల్లీ, జనవరి 13: జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. నైరుతి జపాన్‌లోని క్యుషు ప్రాంతంలో రిక్టర్ స్కేల్‌పై 6.9 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. ఈ క్రమంలో జపాన్ వాతావరణ సంస్థ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. మియాజాకి ప్రిఫెక్చర్‌లో స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9.26 గంటలకు భూకంపం సంభవించినట్లుగా జపాన్ వాతావరణ సంస్థ పేర్కొంది. భూకంపంతో ప్రాణ, ఆస్తినష్టం జరిగినట్లుగా సమాచారం అందలేదు. భూమికి 37 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గురించినట్లు యూరోపియన్ మెడిటరేనియన్ భూకంప కేంద్రం పేర్కొంది. వాస్తవానికి పసిఫిక్ బేసిన్‌లో తరుచూగా భూకంపాలు వస్తుంటాయి.

గతేడాది ఆగస్టు 8న వరుస భూకంపాలు జపాన్‌ను వణికించాయి 6.9, 7.1 తీవ్రతతో వరుస భూకంపాలు వచ్చాయి. క్యుషు, షికోకులో భూకంపాలు వచ్చాయి. గతేడాది జనవరి ఒకటిన సుజు, వాజిమా పరిసర ప్రాంతాల్లో 7.6 తీవ్రతతో భారీ భూకంపం రాగా.. దాదాపు 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. జపాన్ పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్‌లో ఉంటుంది.

ఇక్కడ భూకంపాలు సర్వసాధారణమే అయినా.. అప్పుడప్పుడు భారీ భూకంపాలు వస్తుంటాయి. ఈ ఏడాది జనవరి 7న టిబెట్‌లో వరుస భూకంపాలు వచ్చాయి. దాదాపు 126 వరకు ప్రాణాలు కోల్పోగా.. చాలా ఇండ్లు నేలమట్టమయ్యాయి. 300 మందికిపైగా గాయపడ్డారు. టిబెట్‌లోని టింగ్రి కౌంటీలో వచ్చిన భూకంపంతో భారత్, నేపాల్, భూటాన్‌లోనూ ప్రకంపనలు రికార్డయ్యాయి.

# వైవిధ్యభరితం సువిశాల భారత్‌లో మకర సంక్రమణం

వైవిధ్యభరిత భారతంలో శీతాకాలం ముగింపుకు సూచిస్తూ, కొత్త పంటలు ఇంటికి రావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో భోగితో పాటు మకర సంక్రాతి, పంజాబీలు నిర్వహించుకునే లోహ్రీ పండుగ, అస్సామ్‌లో భోహగ్/భోగాలి/రంగోళి బిహూ వేడుకలు, గుజరాత్‌లో ఉత్తరాయన్, తమిళనాడు పొంగల్, కేరళలో మకర విలక్కు, త్రిపురలో హంగ్రై, మిథిలలో తిలా సక్రెయిత్, యూపీ/బీహార్‌లో ఛత్/ఖిచీ&ధ పూజలు, ఒడిసాలో మకర చౌలా,వమహారాష్ట్రలో మాఘి సంక్రాంతి, కశ్మీర్‌లో శిశుర్ సంక్రాంతి, పశ్చిమ బెంగాల్‌లో పౌశ్ సంక్రాంతి, ఉత్తరాఖండ్‌లో గుగుటి, ఇతర ప్రాంతాల్లో తెహ్రీ, సర్కత్ లాంటి పేర్లతో పర్వదినాలు ఒకే లక్ష్యంతో జరుపుకునే పవిత్ర పండుగలే. రైతుల పంటలు ఇంటికి చేరిన శీతాకాల ముగింపు శుభవేళల్లో ఘనంగా నిర్వహించుకునే వేడుకలే ఈ పర్వదినాలు. పేరు ఏదైనా, భారతదేశవ్యాప్తంగా వైవిధ్యభరితంగా మకర సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకోవడం మన సాంప్రదాయం.

### భోగి, మకర సంక్రాంతి:

తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలతో పాటు కొన్ని ఇతర ప్రాంతాల్లో కూడా భోగి, మకర సంక్రాంతి పర్వదినాలను అత్యంత పవిత్ర భావనలతో సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడం వారసత్వ ఆనవాయితీగా వస్తున్నది. సంక్రాంతి సమయంలో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడం 14 జనవరి 2025న జరగడంతో మకర సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. ధాన్యలక్ష్మి గృహ ప్రవేశం చేయడంతో పాటు శీతాకాలానికి వీడ్కోలుగా ఈ పర్వదినం జరుపుకోవడం జరుగుతున్నది. ఈ సమయంలో సూర్యుడు ఉత్తరం వైపు వెళ్లడంతో దీనిని ఉత్తరాయణంగా పవిత్ర భావనలతో జరుపుకుంటారు. ఈ పండుగ వేళల్లో రంగు రంగుల పతంగులా ఎగిరేయడం, భోగి మంటలతో చలికి వీడ్కోలు పలకడం, ప్రత్యేక పిండివంటలు చేసుకోవడం, కోడి పందాల జోరు, ఇల్లు వాకిళ్లను ముగ్గులతో నింపేయడం, గొబ్బెమ్మలతో అలంకరించడం, సకినాలు అనబడే ప్రత్యేక పిండి వంటలు చేసుకోవడం లాంటివని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఈ ఏడాది సంక్రాంతి వేళల్లో జనవరి 13, 2025న ఉత్తరాయన ప్రారంభ సూచనగా యూపీ ప్రయాగ్‌రాజ్‌లో 'మహా కుంభమేళ' ప్రారంభం అవుతుండటం విశేషం.

### పొంగల్ పండుగ :

దక్షిణ భారత తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పొంగల్ పండుగను జరుపుకుంటారు. తమిళంలో 'పొంగల్' అనగా 'ఉడకబెట్టడం' అని అర్థం. ఈ పండుగ నూతన సంతవత్సరంగా నాలుగు రోజుల పాటు (14 జనవరి నుంచి 17 వరకు) నిర్వహించుకుంటారు. ఈ రోజున సూర్యదేవుడికి ఉడకబెట్టిన అన్నం, బెల్లంతో చేసిన తీపి పదార్థాలను నైవేద్యంగా పెడతారు. ఈ రోజున వ్యవసాయ పని ముట్లు, పశువులను పూజించడం కూడా జరుగుతుంది. పొంగల్ రోజు తమిళ నూతన సంవత్సరం మొదలు అవుతుంది. మొదటి రోజును భోగి పొంగల్‌గా, రెండవ రోజు సూర్య పొంగల్గా, మూడవ రోజు మట్టు పొంగల్‌గా, నాలుగవ రోజు కనుమ్ పొంగల్‌గా పూజ చేయడం జరుగుతుంది.

### పంజాబీలో లోహ్రీ పండుగ:

గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం 13 జనవరిన ఉత్తర భారత పంజాబీలు అతి పవిత్రంగా జరుపుకునే లోహ్రీ పండుగను పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో జరుపుకుంటారు. లోహ్రీ పండుగను సిక్కులు, హిందువులు సమైక్యంగా, ఉత్సాహభరితంగా నిర్వహించుకుంటారు. అనాదిగా కొన్ని ప్రాంతాల ముస్లిమ్‌లు కూడా ఈ పండుగను జరుపుకోవడం విశేషం. ఒక పెద్ద లోహపు (లోహ్) పాత్రలో రుచికరమైన వేపుడు వంటలను అందరూ కలిసి కట్టెల పొయ్యిపై తయారు చేయడం అనే ఆచారం ఈ పండుగ ప్రత్యేకం. ఈ సామూహిక వంటలతో పౌర సమాజం సమైక్యతను చాటుకుంటూ, జరుపుకోవడం లోహ్రీ పండుగ పరమార్థం. మహారాజా రంజిత్ సింగ్ కాలం నుంచే బహుళ ప్రచారంలోకి వచ్చిన లోహ్రీ పండుగ రోజున భోగి మంటలు, నూతన వస్త్రధారణ, సాంప్రదాయ నృత్యాలు, రుచికరమైన వంటలు, ప్రత్యేక కార్యక్రమాలు, ఊరు వాడ ఏకమైన సామూహిక ఉత్సవాలు నిర్వహిస్తారు. మొఘల్ కాలంలో వెట్టిచాకిరీని వ్యతిరేకించిన స్థానిక 'దుల్లా బట్టీ' వీరత్వాన్ని కొనియాడడం జరుగుతుంది.

### అస్సాంలో భోగాలి బిహూ పండుగ:

ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో జరుపుకునే అతి ముఖ్యమైన పండుగల్లో భోగాలి/భోహగ్/రంగోళి బిహూ అనే పర్వదినం ఒకటి. అస్సామీల నూతన సంవత్సరం భోగాలి బిహూ రోజున ప్రారంభమవుతుంది. 'బిహూ' అనగా 'సమృద్ధి ఆనందం' అని అర్థం. పంటలు చేతికి రావడం, వసంతం రాకతో ప్రకృతి పచ్చదనంతో రంగురంగుల పూలతో శోభిల్లడంతో ఉత్సాహంగా ఈ పర్వదిన వేడుకలు జరుపుకుంటారు. ఈ పండుగను అసోం ప్రజలు ఏడాదికి మూడు సార్లు నిర్వహించుకుంటారు. భోగాలి బిహూను జనవరిలో, రోంగాలి బిహూను ఏప్రిల్‌లో, కొంగలి బిహూను అక్టోబర్‌లో నిర్వహించుకుం టారు. బిహూ నృత్యాలు ఈ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి.

### ఉత్తరాయణ్, ఖిచ్డీ పండుగలు:

గుజరాత్‌లో అతి పెద్ద పండుగ 'ఉత్తరాయణ్'. పతంగులు ఎగరేయడం, కుటుంబ సభ్యులు తీపి పదార్థాలను పంచుకోవడం జరుగుతుంది. యూపీ, బీహార్ రాష్ట్రాల్లో ఖిచీ&ధ పర్వదినంగా మకర సంక్రాంతిని నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. భరతమాత వైవిధ్యాలకు నెలవు. పండుగ పరమార్థం ఒకటే అయినా వివిధ పేర్లతో, వివిధ రీతుల్లో పౌర సమాజం మకర సంక్రాంతి వేడుకలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణాల్లో జరుపుకుంటూ తమ సంస్కృతి వారసత్వాలను కొనసాగించడం హర్షదాయకం.

అందరికీ భోగి మంటల సాక్షిగా మకర సంక్రాంతి శుభాకాంక్షలు.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# అపజయాలకు కుంగిపోవొద్దు



హైదరాబాద్, జనవరి 13:అపజయాలకు కుంగిపోవొద్దని.. మీలో ఉన్న శక్తిని గుర్తించి ఆత్మ విశ్వాసంతో అడుగు ముందుకేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు యువతకు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద బోధనలను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన సూచించారు. ఆదివారం దోమల్‌గూడలోని రామకృష్ణ మఠ్‌లో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై యువతకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేటి తరం యువత చిన్న చిన్న సమస్యలకే కుంగిపోతున్నది.

ఒక అపజయం ఎదురైతే చాలు.. మా వల్ల ఏదీ కాదేమోననే నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లే ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటన్నింటిని ఎదురొని ముందుకు సాగితేనే విజయం దకుతుందని తెలుసుకోవాలి. యువత తలుచుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదు' అని అన్నారు. 'మీ ఆలోచన తీరే మిమ్మల్ని విజయం వైపు నడిపిస్తుంది. మీ తల్లిదండ్రులు, గురువులు.. ఇలా ఎవరో ఒకరు వచ్చి చేయి పట్టి నడిపిస్తారనే భావన నుంచి బయటకు రండి. మీ జీవితాన్ని మీరే తీర్చిదిద్దుకోవాలి.

'యువతను జాగృతం చేసి సన్మార్గం వైపు నడిపించేందుకు రామకృష్ణ మఠ్ చేస్తున్నకృషి అభినందనీయం. యువతలో జాతీయ భావాన్ని పెంపొందిస్తూ.. వారిలో దాగి ఉన్న శక్తిని వెలికి తీస్తుంది. నేను చదువునే రోజుల్లో ఇకడికి అనేక సార్లు వచ్చాను.. ఉమ్మడి ఏపీలో మంత్రిగా ఉన్నప్పుడు వచ్చాను.. ఇప్పుడు వచ్చాను.. ఇకడికొచ్చిన ప్రతిసారి నాలో ఒక పాజిటివ్ ఎనర్జీ వస్తుంది..ఆ ఎనర్జీ నన్ను నా లక్ష్యం వైపుకు నడిపిస్తుంది' అని మంత్రి వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ తమిళ మ్యాగజైన్ 'తుగ్లక్' మ్యాగజైన్ ఎడిటర్ గురుమూర్తి, రామకృష్ణ మఠ్ అధ్యక్షుడు స్వామి బోధమయానందా జీ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మళ్లీ మొదలైన ఎరువుల కోసం బారులు

రాజన్న సిరిసిల్ల, జనవరి 13:(నేటినిజం ప్రతినిధి): ఏ ముహుర్తాన కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిందో కానీ ఎరువుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. యూరియా కోసం సొసైటీల ఎదుట బారులు కడుతున్నారు. చెప్పులు క్యూలైన్లో పెట్టీ మరీ పడిగాపులు కాస్తున్న దారుణ పరిస్థితులు నిత్య కృత్యమవుతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల గుండారం గ్రామంలో ఎరువుల కోసం ఆధార్ కార్డులు లైన్‌లో పెట్టి రైతులు నిలుచున్నారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చుంటే అరకొరగానే ఎరువులు ఇస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో సొసైటీల్లో యూరియా అవసరమైన మేర సరఫరా జరిగేదని తెలిపారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

# మైదానాల్లోనే పతంగులు ఎగురవేయాలి

### –పతంగులు విద్యుత్ తీగలపై పడితే..లాగొద్దు
### –అత్యవసర పరిస్థితులంటే 1912కు కాల్ చేయాలి

హైదరాబాద్, జనవరి 13: సంక్రాంతి పండుగ రోజుల్లో పతంగులు ఎగురవేయడం ఆనవాయితీగా వస్తున్నదని, అయితే పతంగులు ఎగురవేసేవారు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి సూచించారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలని, ఒకవేళ పతంగులు కానీ, మాంజలు కానీ విద్యుత్ లైన్లపై, విద్యుత్ పరికరాలపై పడితే కరెంటు సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

కాటన్, నైలాన్, లినెన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడాలని, మెటాలిక్ మాంజాలు వాడొద్దని, మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు కనుక.. అవి వైర్లపై పడితే విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉందని సీఎండీ పేర్కొన్నారు. పొడి వాతావరణంలో మాత్రమే పతంగులు ఎగురవేయాలని, తడి వాతావరణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. పతంగలు, మాంజాలు విద్యుత్ వైర్లపై పడినప్పుడు వాటిని వదిలేయాలని, ఒకవేళ వాటిని పట్టుకుని లాగితే విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకొని విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు లేదా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినా 1912కు కాల్ తమకు సమాచారం ఇవ్వాలని, లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి తెలియజేయాలని, మొబైల్ యాప్ లేదా www.tgsouther npower.org వెబ్‌సైట్‌లో కానీ సమాచారం ఇవ్వాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ వినియోగ దారులకు, ప్రజలకు సూచించారు.



# ప్రభుత్వ పథకాల విధి విధానాలు పారదర్శకంగా ఉండాలె -ఎమ్మెల్యే మర్రి

హైదరాబాద్, జనవరి 13: ప్రభుత్వ పథకాల విధి విధానాలు పారదర్శకంగా ఉండాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన హైదరాబాద్ జిల్లా సన్నాహక సమావేశంలో మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక, పేదల గుర్తింపు, పథకాల అమలు తీరు, విధివిధానాలను సమీక్షా సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించే క్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి అర్హత విషయంలో ప్రభుత్వం కొన్ని సవరణలు చేయాలని సూచించారు. ఎల్లో ప్లేట్ ట్యాక్సీ డ్రైవర్లను ఓనర్లుగా గుర్తించడం ద్వారా ఎంతో మంది పేదలకు అన్యాయం జరుగుతున్నద న్నారు. దివ్యాంగుల జాబితాలో తలసేమియా, కీమో, డయాలసిస్ పేషంట్లకు కూడా సదరం సర్టిఫికెట్లు జారీ చేసి వారిని కూడా లబ్ధిదారులకు ఎంపిక చేయాలన్నారు.

అదేవిధంగా రేషన్ కార్డుల పంపిణీ పారదర్శకంగా ఉండాలని, రేషన్ కార్డుల్లో మరణించిన వారి పేర్ల తొలగింపు, కొత్తవారి నమోదు ప్రక్రియను సులభతరం చేయాలన్నారు. అధికారుల అలసత్వం, సమన్వయ లోపంతో జియో ట్యాగింగ్ లేకుండానే అధికారులు కూర్చున్న చోటే ప్రజలను రమ్మని ఫొటోలను సేకరించడం సరికాదన్నారు. ప్రణాళికాబద్ధంగా ఇంటింటికీ తిరిగి నమోదు చేసుకోవాలని మంత్రిని కోరారు. అదేవిధంగా వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఉంటున్న లబ్ధిదారుల పేర్లను కూడా జాబితాలో చేర్చారని, వారికి కూడా పథకాలను అందించాలన్నారు.

# బాధితుల సమస్యలను ఓపికగా వినండి

### –సానుభూతితో వ్యవహరించండి
### –రాచకొండలో కొత్త సంవత్సర వేడుకల్లో
### –సిబ్బందికి సీపీ సుధీర్‌బాబు దిశానిర్దేశం

హైదరాబాద్, జనవరి 13: వివిధ రకాల సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో అధికారులు, సిబ్బంది సానుభూతితో వ్యవహరించాలని, వారి సమస్యను ఓపికగా విని స్నేహపూర్వకంగా



వ్యవహరించాలని సిబ్బందికి రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచించారు. కొత్త సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో సిబ్బంది నూతనోత్సాహంతో పనిచేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. నేరెడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయిలో అధికారుల వరకు, మినిస్టీరియల్ స్టాఫ్‌తో కలిసి సోమవారం నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించారు.

ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి వరకు అందరు నూతన క్రిమినల్ చట్టాల గూర్చి సంపూర్ణ పరిజ్ఞానం కల్గి ఉండాలని, నూతన చట్టాల అమలులలో ఎదురవుతున్న అవరోధాలను ఎప్పకటిప్పుడు ఉన్నతాధికారులకు తెలుపాలని వివరించారు. రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థలు, పంచాయితీలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వారి వారి పరిధిలో తగిన ముందస్తు జాగ్రత్తలు మొదలు పెట్టాని ఆదేశించారు. అనంతరం రాచకొండ కమిషనరేట్‌కు చెందిన అంబర్‌పేట్‌లోని కార్ హెడ్ క్వార్టర్స్‌లోను జరిగిన వేడుకలలో సీపీ సుధీర్‌బాబు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ పాఠశాలలో తెలుగును పాఠ్యాంశంగా బోధించాలి : సబితారెడ్డి



హైదరాబాద్, జనవరి 13:కార్పొరేటర్ పాఠశాలలో తెలుగును పాఠ్యాంశంగా బోధన ఉండాలని మాజీ విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడఅన్నారు. మీరంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్‌లో ఉన్న శాంటినోస్ గ్లోబల్ స్కూల్ 8వ వార్షికోత్సవ వేడుకలకు ఆమె హాజరయ్యారు. విద్యార్థులకు ఆమె చేతుల మీదగా బహుతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విద్యకు ఎంతో ప్రధాన్యత ఇచ్చే వారని ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడానికి కోట్ల నిధులు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అర్కల భూపాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు దీప్‌లాల్ చౌహాన్, అర్కల కామేష్ రెడ్డి, సిల్వేరు సాంబ శివ, మహిళా అధ్యక్షురాలు జలాల్పూర్ సునిత బాల్ రాజ్, ప్రభాకర్ రెడ్డి, నర్సిరెడ్డి, పాఠశాల యజమాన్యం, అధ్యాపాకులు తదితరులు ఉన్నారు.

# సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..

### –ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, జనవరి 13:ఉప్పల్‌ను సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కాప్రా డివిజన్ సీఎస్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లు వేయించాలని, డ్రైనేజీ సమస్య తీర్చాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాలనీలో అన్ని సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఎస్‌రావునగర్ డివిజన్ టీఎన్ఐఐసీ కాలనీలో రూ.30లక్షలతో చేపట్టే కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు తదితరులు పాల్గొన్నారు.

# రోకలి బండతో భర్తను హత్య చేసిన భార్యలు..

సూర్యాపేట, జనవరి 13: భర్తను రోకలి బండతో ఇద్దరు భార్యలు కొట్టి చంపారు. ఈ సంఘటన ఇప్పుడు తెలంగాణాలో హాట్ టాపిక్ అయింది. భర్తను రోకలి బండతో ఇద్దరు భార్యలు కొట్టి చంపిన కేసు వివరాలిలా ఉన్నాయి.

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుర్రంతండాలో భర్తను రోకలి బండతో కొట్టి చంపారు ఇద్దరు భార్యలు.

ఆదివారం అర్ధరాత్రి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుర్రంతండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకుని హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని.. మృతుడి ఇద్దరు భార్యలను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఇక ఈ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సంప్రదాయాలను కాపాడుకోవడం ముఖ్యం : హరీశ్‌రావు

సిద్ధిపేట,జనవరి 13:మన పుట్టిన ఊరును, మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడం అనేది చాలా ముఖ్యమని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో సంక్రాంతి పండుగను పురస్కరించికుని నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని, నిర్వహకులను అభినందించారు.నేటి తరానికి మన పండుగలు, వాటి గొప్పతనాన్ని గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అన్ని రంగాల్లో కూడా అభివృద్ధిలో ముందుకు పోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు మోసం చేశారని హరీశ్‌రావు అన్నారు.

మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2500 ఇస్తానని మాట తప్పినట్లు చెప్పారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. బతుకమ్మ చీరలు, తులం బంగారం ఎగ్గొట్టిందని.. పాత పథకాలు బంద్ అయిపోయాయన్నారు. అలాగే కొత్త పథకాలు ఏవీ రాలేదని విమర్శించారు.



# రంగుల హరివిల్లు 'సంక్రాంతి' సందళ్ళు



-శారదా శృంగేరి
94902 61119












**శ్లో॥ ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కర**
**దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే॥**
**సప్తాశ్వరథ మారూఢం ప్రచండం కస్యపాత్మజమ్।**
**శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహం॥**

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయంలో సంక్రాంతి పండుగ ప్రారంభమవుతుంది. కావున తొలుతుగా సూర్య భగవానుని పూజించి ఆరాదించడం అనాదిగా వస్తున్న ఆచారంగా సూర్యదేవుని స్మరించుకుందాం.

## పండుగ ప్రస్తావన :

భారతదేశంలోని హిందువులందరు ఎక్కడ ఉన్నప్పటికి సంక్రాంతి పండుగను ప్రతిష్ఠాత్మకంగా జరుపుకోవడం ఆచారం. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో మకర సంక్రాంతి పండుగ పొంగల్ పేరిట జరుపుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో మరీ ముఖ్యంగా కోనసీమలో సంక్రాంతి పండుగను రంగు రంగుల ముగ్గులు, గొబ్బిళ్లు, కోడి పందేలు, ఇంటికి కొత్త అల్లుళ్ల సందడి. భోగి పండుగ రోజున ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా ఉత్సవం ప్రారంభం కానుంది. సంక్రాంతికి హరిదాసు కీర్తనలు, గాలి పటాలు, బసవన్న చిందులు, భోగి మంటలు, దేవాలయాలలో శ్రీకృష్ణుడు గోదాదేవికి కళ్యాణం పండుగ ప్రారంభమైంది. జనవరి 13న భోగి, 14న సంక్రాంతి, 15న కనుమ రావడం విశేషం. సంక్రాంతి వస్తోందంటే చాలు ముఖ్యంగా పల్లెటూళ్లలో పండుగ వాతావరణం మొదలవుతుంది. ఈ పండుగ రోజుల్లో ఉద్యోగరీత్యా వలసపోయిన వారు సొంతూళ్లకు బయలుదేరుతారు. ఇంకా సంక్రాంతి కోలాహలం వారం రోజుల ముందే మొదలైంది. బస్సులు, రైళ్ళు, ఇతర వాహనాలతో రోడ్లన్ని రద్దికావడం విదితమే. సంక్రాంతి అంటే సూర్యగమనం వలన కలిగే సమ్యక్ క్రాంతి! అయనం అంటే ప్రయాణం సూర్యుడు ఉత్తరం వైపు ప్రయాణించే సమయం కనుక ఆ కాలమంతా ఉత్తరాయణం. ప్రాపంచిక భ్రాంతి నుండి ఆంతరంగిక క్రాంతిని కోరుకునే సాధకుడికి, ఇది పుణ్యకాలం. ఈ సమస్త ప్రకృతిలో జరిగే పరిణామ స్ఫూర్తి సంక్రాంతి. ఇది పంటల పండుగ, పెద్దల పండుగ, పశువుల పండుగ అన్నీ కలిపి కన్నుల పండుగ. సంక్రాంతి పండుగను భారతదేశంలోని, అనేక రాష్ట్రాల్లో వివిధ ఆచారాలతో సంక్రాంతిని జరుపుకుంటారు. ఈ పండుగ జరుపుకోవడానికి ముఖ్య కారణం రైతన్నలే, ఆరుగాలం శ్రమించిన పంట చేతికి వచ్చిందన్న ఆనందంతో రైతులు ఉంటారు. రైతన్నల ఇళ్లలో సిరులు కురిపించే ఈ పండుగను వారి ఆనందాన్ని అందరితో పంచుకునే పండుగే సంక్రాంతి. సంక్రాంతి లక్ష్మి ఘల్లు ఘల్లుమంటూ ఇంటిలో అడుగుపెట్టి, ఇల్లంతా ధాన్యరాశులు కుప్పలు కుప్పలుగా నిండి విరాజిల్లుతూ ఉంటుంది. జరుపబోవు సంవత్సరానికీ కూటికి లోటు లేకుండా చేసిన సంతోషాలు ఇచ్చే పండుగగా కూడా గుర్తింపు ఉంది. ఈ పండుగ రోజున గడపకు పసుపు పెట్టి... కుంకుమ పెట్టడం, వాకిట్లో రంగుల ముగ్గులు వేసి... గొబ్బెమ్మలు పెట్టడం... ఇంట్లో పిండివంటలు, సూర్యోదయ కాలంలో సూర్యదేవుని ముందు పిడకలతో పొయ్యి వెలిగించి నిండు కుండలో పాలు, బియ్యం, బెల్లంతో పరమాన్నం చేసి తొలుతుగా సూర్యునకి నివేదించడం సంప్రదాయం. సూర్య దేవునిని ఆరాధించడం వలన ఏడాది పొడుగున శుభాలు కలుగుతాయంటారు పండితులు.

## పండుగ సంప్రదాయం :

సంక్రాంతి పండుగకు సంవత్సరాలకు పైగా సంప్రదాయ బద్ధంగా సంక్రాంతి పండుగను ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కూడా నాలుగు రోజుల పాటు జరుపుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు సంక్రాంతి లేదా పొంగల్, మూడవ రోజు కనుమ (మట్ట పొంగల్) నాల్గవ రోజు ముక్కనుమ (కన్యా పొంగల్) గా ఘనంగా జరుపుకుంటారు. సంక్రాంతి నుండి కొత్త సంవత్సరం ప్రారంభమైనట్లు ఆచారం. భోగి రోజున తెల్లవారు జామునే భోగిమంటలు, ఇంట్లో చిన్న పిలల్లు భోగి పళ్ళు పోస్తారు. సంక్రాంతి లేదా పెద్దల పండగ. పితృదేవతలను స్మరించుకుంటారు. కొంతమంది ఆనవాయితీని అనుసరించి బొమ్మల కొలువు పెడతారు. కనుమ రోజున శివునికి ఇష్టమైన నందిని పూజించడం ఆచారం. ఈ రోజు ఎద్దులను పూజిస్తారు. ముక్కనుమ రోజున అమ్మవారిని పూజించి నైవేద్యం పెడతారు. దక్షిణ భారతదేశంలో ఈ పండుగను కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో సహా ఆంధ్రప్రదేశ్ సెటిలర్స్ తెలంగాణాలో ఈ సంక్రాంతి పండును ఆనందంగా




జరుపుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటు తున్నాయి. ముఖ్యంగా పల్లెల్లో ఎక్కడ చూసినా సంక్రాంతి సందడి కనిపిస్తోంది. పల్లెలు కళకళలాడుతున్నాయి, కొత్త అల్లుళ్లు, ఆడపడుచులు, చుట్టాలు, మిత్రుల రాకతో గ్రామాల్లో సంక్రాంతి కళ నెలకొంది. వ్యాపారాలు, ఉద్యోగాల కోసం పట్నంబాట పట్టిన వారు తిరిగి స్వగ్రామాలకు చేరుకున్నారు. ప్రజలంతా అయినవారి మధ్య పండగ జరుపుకోవలనే ఉ




త్సాహంతో పల్లెలన్నీ కోలాహలంగా మారాయి. మూడు రోజుల పాటు సందడిగా సాగనున్న సంక్రాంతి సంబరాల్లో రంగవల్లులు, భోగి మంటలతో భోగిపండుకు స్వాగతం పలికిన తెలుగువారు. అలాగే మకర సంక్రాంతికి స్వాగతం పలుకుతూ వక్షం రోజులుగా గంగిరెద్దులు పల్లెల్లో సందడి చేస్తున్నాయి. ధనుర్మాసం కావడంతో ఉదయమే చేతిలో చెక్కలు, నుదుట నామాలు, మెడలో పూలదండలతో హరిదాసుల సంకీర్తనలు వినిపిస్తున్నాయి. మకర సంక్రాంతి, కనుమ పండుగల నేపథ్యంలో అంబరాన్నంటే సంక్రాతి సంబరాలు అంబరాన్నంటుతూన్నాయి.

## సంక్రాంతి అంటే పుణ్యకాలం:

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణము. మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభము అవుతుంది. ఆ తరువాత కుంభ, మీన, మేష, వృషభ, మిథున రాశులలో కొనసాగినంత కాలము ఉత్తరాయణము. శారీరక పరిశ్రమకు, పూజలకు, సాధనలకు, కృషికి అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము ఉత్తరాయణము. కర్కాటక రాశిలోకి సూర్యుడు ప్రవేశించిన దగ్గరినుండి మొదలై, ఆ తరువాత సింహ, కన్య, తుల, వృశ్చికం, ధనూ రాశులలో కొనసాగినంత కాలము దక్షిణాయణము. మానసికమైన అర్చనకు, ధ్యానానికీ, యోగానికీ, దీక్షలకు, బ్రహ్మచర్యానికి, నియమ నిష్టలకు అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము దక్షిణాయణము. పన్నెండు నెలల సంవత్సర కాలములో ఆరు నెలల దక్షిణాయణము దేవతలకు ఒక రాత్రి, ఆరు నెలల ఉత్తరాయణము దేవతలకు ఒక పగలు. కనుక దేవతలు మేలుకునే కాలము ఉత్తరాయణ పుణ్య కాలము. సంక్రాంతి అంటే పుణ్యకాలం.

## పిండి వంటలు, కొత్త బట్టలు:

ఇక గ్రామాల్లో ఎక్కడ చూసినా పిండివంటల ఘుమఘుమలే. సంక్రాంతి అంటే గుర్తుకు వచ్చే అరిసెలు, బూరెలు, గారెలు, బొబ్బట్లు, కాజాలు, సున్నుండలు, లడ్డూలు, పూతరేకులు, కజ్జికాయలు, జంతికలు, అప్పడాలు ఇలా ఒక్కో ఇంట్లో నాలుగైదు రకాల పిండివంటలు సిద్ధమవుతున్నాయి. ఇక కొత్తబట్టల సంగతి సరేసరే, ఏడాదంతా సంక్రాంతికి వేసుకునే కొత్తబట్టల గురించే ఆలోచిస్తారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రజలంతా హాయిగా షాపింగ్ చేసేశారు. ఎక్కడ చూసినా షాపింగ్ మాల్స్ కిటకిటలాడిపోతున్నాయి. సంక్రాంతి అంటే కొత్తబట్టలు ఉండాల్సిందే. దీంతో వ్యాపారులు కూడా భారీగానే అమ్మకాలు జరిపారు. కొన్ని ప్రాంతాల్లో గత ఏడాది కంటే రెట్టింపు వ్యాపారం జరిగింది.

## పందెం కోళ్ల జోరు:

సంక్రాంతి అంటే రక్కున గుర్తొచ్చేది కోడి పందేలు. పందెం పుంజు బరిలో దిగనిదే



సంక్రాంతి సందడి పరిపూర్ణం కాదు. ఎప్పటిలాగే కోడి పందేలు కూడా సందడిగా సాగుతున్నాయి. కోర్టు ఆంక్షలు, పోలీసుల హెచ్చరికలు ఉన్నా పందెం రాయుళ్లు మాత్రం వెనక్కితగ్గలేదు. ముఖ్యంగా తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీగా పందేలు సాగుతున్నాయి. కొన్నచోట్ల ప్రజాప్రతినిథులు దగ్గరుండి పందేలు నిర్వహిస్తున్నారు. తెలుగు ప్రజలంతా ఎక్కడ ఉన్నా ఈ పండుగను వేడుకగా జరుపుకుంటారు. లేదా ఎంత దూరంలో అయినా. విదేశాల్లో ఉన్నా సరే. ఈ పండుగకు సొంతూరుకు రావాలని ఆరాటపడతారు. అందరికీ అంత ప్రత్యేకం ఈ పండుగ. సంక్రాంతి అంటే మూడు రోజుల పండుగ. మొదటి రోజు భోగి, రెండో రోజు సంక్రాంతి, మూడో రోజు కనుమ ఇలా మూడు రోజు పాటు సందడి కనిపిస్తోంది. ఒక్కో రోజుకూ ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఈ ఏడాది జనవరి 14 నుండి 16 వరకు మూడు రోజులు సంక్రాంతి వేడుకలను జరుపుకుంటున్నారు. దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ పండుగకు సంబంధించి ఒక ఆచారం ఉంది. ఈ ఆచారం ప్రకారం ప్రజలు తమ ఇళ్లలో పాత వస్తువులను తీసివేసి కొత్త వాటిని తీసుకువస్తారు. అంతేకాదు పేద ధనిక అనే తేడాలేదు... ప్రతి ఒక్కరూ తమ శక్తికి తగినట్లు కొత్త బట్టలను ధరిస్తారు. సంక్రాంతి పండుగకు పంట కోతలు అయిపోయి ధాన్యం ఇంటికి వస్తుంది. దీంతో పొలాల్లో ఉండే క్రిమికీటకాలు ఇంట్లోకి రాకుండా వాకిళ్ళలో కళ్లాపి చల్లుతారు. ఆ తర్వాత ముగ్గులు వేసి అందులో రకరకాల రంగులు నింపి, వాటి మధ్యలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను పెడతారు. ఇక 'శ్రీమన్నారాయణుడి ప్రత్యక్షరూపం సూర్యభగవానుడు. సంక్రాంతి పర్వదినం రోజున ఉదయాన్నే లేచి తలస్నానం చేసి కొత్త దుస్తులను ధరించి సూర్యభగవానుడిని ఆరాధించాలి. ఆ తర్వాత ఆదిత్యహృదయం, సూర్యాష్టకం పారాయణం చేయాలి. ఇక ఇంట్లో ఉండే పెద్దవాళ్ళ ఆశీర్వాదం తీసుకోవాలి.









## ఆరోజున చేయవలసిన దానాలు...

సంక్రాంతి పండుగన పెద్దలను పూజించడం ఆనవాయితీ. సూర్యుడు సంక్రమణ సమయంలో పితృదేవతలకు తర్పణాలు, దానాలు చేయాలి. సంక్రాంతి పర్వదినంనాడు భూదానం, సువర్ణదానం, వెండిదానం, అన్నదానం, పుస్తకదానం, బియ్యం, పప్పు, ఉప్పు, గుమ్మడికాయ వంటి నిత్యావసర వస్తువులను దానం చేస్తే మంచి ఫలితాలు కలుగుతాయంటారు. ఇక మనమంతా సంక్రాంతి పండుగను పిండివంటలు వగైరా సంబరాలను ఈ కవితలో ఆస్వాదిద్దామా!.. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

## 'సంక్రాంతి' శోభ

**నవ్య, దివ్య, భవ్య, 'సంక్రాంతి'... ఆ ప్రభాత కిరణాలు,**
**నవ, నవోన్మేష, చైతన్య, విన్యాసాలు. రమణీయ, రాగా ఋణ ఉషస్సులు,**
**కమనీయ సప్తాశ్వర, సమారూఢం పరువులు.**
**మకర సంక్రమణ, స్వర్ణ, వర్ణ, దీప్తి కాంతులు,**
**పౌస్యలక్ష్మికి, నళినీకాంత, కలితవెలుగులు.**
**హేమంతవేళ, నూతన సీమాంతర, వధువు వోలే,**
**పల్లె, పల్లె లోన, వెల్లివిరిసిన, సంక్రాంతి సోయగాల సందళ్ళు.**
**పచ్చిపసుపు, ముఖాన మెరుగులద్ది,**
**మిరప పండు, ఎరుపుబొట్టువెట్టి,**
**తెలిమంచు, తెరచీర, నూలుకొల్పి,**
**బంతి చేమంతుల, కొకింత, నెయ్యముకూర్చి,**
**ముత్యాలముగ్గుల నిగ్గులుపరికిస్తూ,**
**గుమ్మడిపూల సింగారాలు,**
**గొబ్బెమ్మల హొయలు తిలకిస్తూ...**
**పంట కళ్ళాలవెంట, సాగింది, 'సంక్రాంతిలక్ష్మి'.**
**వసుధైక కుటుంబాలకు ఆనందాల పందిళ్ళు వేసింది.**
**భోగిపళ్లు, పతంగుల విన్యాసాలు,**
**బొమ్మలకొలువుల విందు చేసింది.**
**సాముహభోజనాలలో, సామరస్యరుచులు పంచింది.**
**లేగపాలలో, కాగిమాగిన భోగిపొంగలి,**
**తీయ తియ్యగా, నోరూరించే కొత్త బెల్లం అరిసెలు,**
**కొసరి కొసరి చవులూరించే, పైర వంకాయ కూర,**
**ముదురుగుమ్మడితోడు, మునగ పులుసు,**
**నాల్కతుప్పువదులు, నక్క దోస పచ్చడి,**
**చేతిజిడ్డు వదలని గడ్డ పెరుగు,**
**షడ్రుచుల విందుతో,**
**సకుటుంబం సందడిసేయగా,**
**గడప గడపలో, అనందం వెల్లివిరియగా,**
**సతత హరిత "క్రాంతి" - "సంక్రాంతి"**
**హరిలోరంగ హరి,**
**హరిలోరంగ హరి అంటూ,**
**హరిదాసుల, ఆద్యాత్మిక కీర్తనలతో...**
**పల్లె, పట్నం వాడవాడలా పరవశించింది.**
**శుభం భూయాత్!**
**సర్వేజనాః సుఖినో భవంతు!**








# పాడిపంటల సౌభాగ్య సిరి మకర సంక్రాంతి పర్వం

గుమ్మడి పూల పరాగము నద్దిన పసిమి మోముతో, మిరప పండు బొట్టుతో, మంచు తెరల చీరలతో, బంతి, చేమంతి పూల దండల కొప్పుతో, తెలిమబ్బు గొడుగు నీడలో, సిరుల కడలిలాగా, సంక్రాంతి లక్ష్మి కదలి వచ్చిన రోజు 'సంక్రాంతి'.

'సం' అంటే మిక్కిలి, 'క్రాంతి' అంటే అభ్యుదయం. మంచి అభ్యుదయం ఇచ్చే క్రాంతి కనుక దీనిని 'సంక్రాంతి'గా పెద్దలు నిర్వహించారు. ఇక 'మకరం' అంటే పట్టుదలకు ప్రతీక. హేమంత రుతువులో, శిశిరారంభంలో ఉత్సాహభరితంగా 'మకర సంక్రాంతి'. ఉంటుందీ.

సూర్యుడు ఒక నిర్దిష్టమైన కాలగమనంతో సంచరించుచూ, ఒక్కొక్క రాశిలో ఒక నెల రోజులపాటు కొలువు దీరి, మరియొక రాశిలోకి ప్రవేశించే దినమును 'సంక్రమణం' అంటారు. మనకు సంవత్సరంలో రెండు 'అయనాలు' సంక్రమిస్తాయి. ప్రతీ సంవత్సరం జనవరి పద్నాలుగున వచ్చే ఉత్తరాయణాన్ని 'మకరసంక్రమణ' మని జులై పదహారవ తేదిన వచ్చే దక్షిణాయణాన్ని 'కర్కాటక సంక్రమణ పుణ్య కాలంగా వ్యవహరిస్తారు. దక్షిణాయనంలో మూడు ఋతువులు, ఉత్తరాయణంలో మూడు ఋతువులు కలిపితే మొత్తం ఆరు ఋతువులు. ప్రతి ఋతువుకి మాసాలు రెండు. ఇలా పన్నెండు మాసాలు ఆరు ఋతువులు రెండు ఆయనాలు కలిపితే సంవత్సరం అవుతుంది. దీనికి 'కాలచక్రం' అని పేరు. సంవత్స రానికి పన్నెండు సంక్రాంతులు వస్తాయి. ఈ మకర సంక్రాంతికే 'ప్రత్యేకత. ఉత్తరాయణం శ్రేష్ఠమైన పుణ్యకాలం. దేవతలకు దక్షిణాయణం రాత్రి. ఉత్తరాయణం పగలు. కనుక శుభకార్యాలు చేయడానికి ఉత్తమమైన కాలం ఉత్తరాయణం. ఎందుకంటే దక్షిణాయణం దేవతలకు రాత్రి కాలం కాబట్టి వారు నిద్రిస్తూ వుంటారు. ఉత్తరాయణం వేళలో దేవతలు మేల్కొని ఉంటారు. కాబట్టి యజ్ఞ యాగాదులు, ఉపనయనం, వివాహాది శుభకార్యాలు ఈ సమయంలో జరుపుకుంటే



ఉత్తమమని శాస్త్రవచనం.

రవి ధనుస్సు రాశి నుండి మకరరాశిలోకి ప్రవేశించే కాలాన్ని 'మకరసంక్రాంతి' అని అంటారు. ఇది మనకు చాంద్రమాన ప్రకారం పుష్యమాసంలో హేమంత రుతువులో వస్తుంది. హిందువుల పండుగ లన్నింటిలో, ప్రత్యేకంగా రైతులకు గొప్ప పండుగ. అత్యంత పవిత్రమైన ఈ మకర సంక్రాంతి ఉత్తరా యణ పుణ్యకాలంగా స్కందపురాణం వచిస్తుంది. వ్యవహరింపబడుతున్నదని

'సంక్రాంతి' పండుగ సూర్యునికి చెందిన పండుగ కాబట్టి సూర్యభగవానుడిని పూజించడం అనవాయితీ.

అది సూర్యుని పరమేశ్వర స్వరూపముగా భావించి పూజించాలని, ఆరోగ్య ప్రదాత అయిన సూర్యారాధన 'సంక్రాంతి' రోజున శ్రేష్టము. భూమిపైన సమస్త ప్రాణులకు సూర్యుడే ఆధారమని మనకు తెలుసు. సూర్యుడు జ్ఞానానికి మార్గదర్శకుడు.

ఈ 'సంక్రాంతి' పండుగను మూడు రోజులు చేసుకునే ఆనవాయితి. తొలిరోజు భోగి పండుగ. దక్షిణా యనము నుండి శుభప్రదమైన ఉత్తరాయణంలోకి అడుగుపెట్టే శుభదినం.. ఆ రోజున భోగిమంటలు వేసుకుని, ఉన్న కాస్త చిరుచలిని పారద్రోలడానికి చేసే ప్రయత్నమిది. హేమంత రుతువులో చలితో పాటు మంచు కూడ ఉంటుంది. క్రిములన్ని బాగా విజృభించ గలిగినదీ తమ విష శక్తిని లోకానికి ప్రవేశింప చేయగలిగినదీ మంచులోనే కనుక ఈ క్రిముల వల్ల రోగాలు విజృంభిస్తాయి. కనుక మన ప్రాచీనులు ఈ విషయాన్ని తెలిసి తెల్లవారు జామున భోగి మంటలు ఏర్పాటు. చేశారు. ఈ భోగి మంటల నుంచి వచ్చే దాహక శక్తికి క్రిములు చనిపోతాయి. ఇదీ భోగిలో దాగి వున్న భోగి పండుగ అంటే అన్ని భోగాలను సమకూరుస్తుందని పెద్దలు చెప్తారు. ఈ భోగి పండుగ రోజున బాలబాలికలకు రేగుపండ్లు, అక్షింతలు, చిల్లర నాణేలతో దిప్పి తీసి తలమీద పోస్తారు. ఇదే భోగి పండ్ల పేరంటం. పేరంటానికి వచ్చిన ముత్తైదువులంతా పిల్లల తలపై రేగుపండ్లు పోయటం వల్ల సంవత్సరం నుంచి తగిలిన దిష్టి పోతుందని ప్రతీతి. ఎటువంటి ధృష్టిదోషాన్నైనా నివారించేందుకు ఈ సంప్రదాయమును పాటిస్తారు.

**సంక్రాంతి:** ఈ రోజున ప్రాతః కాలంలోనే నిద్రమేల్కొని అభ్యంగస్నానం ఆచరించి, క్రొత్తగా ఇంటికి తెచ్చుకున్న పండించిన ధాన్యంతో, పాలను కలిపి పొంగలి తయారుచేసి ప్రత్యక్షదైవమైన సూర్యభగ వంతునికి నివేదన చేసి ఇంటిల్లిపాది స్వీకరిస్తారు. ఇది ఉత్తరాయణ పుణ్యకాలం కావడంచే స్వర్గ ద్వారాలు తెరువబడి ఉంటాయని, కనుక మరణించిన వారికి మోక్షప్రాప్తి కల్గుతుందని, ఈ రోజు పితృ దేవతలను ఆరాధించి తర్పణాలు వదులుతారు. మరణించిన వారికి ఉత్తమ లోక ప్రాప్తి కలుగుతుందని భీష్ముడు ఉత్తరాయణం వరకు వేచి మరణాన్ని కోరుకోవడంలో అంతరార్థం కూడా ఇదే !

**కనుమ :** ఇది ప్రధానంగా వ్యవసాయ దారుల పండుగ 'కనుమ' అంటే 'పశువు' అని అర్థం. ఈ రోజున పశువులన్నింటినీ అలంకరించి, వాటికి గంటలు కట్టి, పసుపు, కుంకుమలు చల్లి, భక్ష్యములను తినిపిస్తారు. ఆ మూగజీవులు యెడ తమ ప్రేమను చూపించే కృతజ్ఞతకు సూచకం ఇది. కొన్ని ప్రాంతాల్లో, కొత్తగా పండిన ధాన్యంతో పులగాన్ని వండి, ఆ అన్నం మెతుకులను పొలంలో చల్లుతారు. దీనికే 'పొలి చల్లడం' అంటారు. 'కనుమ' నాడు కాకి కూడ ప్రయాణం' చేయదు' అనే సామెతను బట్టి ఈ రోజున ప్రయాణం నిషిద్ధమని తెలుస్తోంది. పైగా ధర్మశాస్త్రాలు కూడ మకర సంక్రాంతి మరునాడు ప్రయాణం చేయరాదని బోధిస్తున్నారు.

ఈ సంక్రాంతి పండుగ మన రాష్ట్రంలోనే కాక, తమిళనాడులో ఇది 'పొంగల్' పండుగగా జరుపు కుంటారు. మహారాష్ట్రంలో 'తిల సంక్రాంతి' పేరుతో నువ్వులు పాత్రలో పోసి దానం చేస్తారు. కర్ణాటకలో నువ్వులు, బెల్లం కలిపి అందరికీ పంచి పెడతారు.

హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, కొత్త అల్లుళ్ళు ,, అత్తగారిండల్లకు రావడం, కోడి పందాలు, ఎడ్ల పందాలు, బొమ్మల కొలువులు, రంగవల్లుల పోటీలు బుడు బుక్కలు ఇలా సంక్రాంతి తెలుగు వాళ్ళ తెలుగుతనానికి ప్రతీక.

ఈ సంక్రాంతి సంబరాలను యావద్భారత దేశమునందే కాకుండా ప్రపంచ దేశాలైన గ్రీకు, రోమన్, యూరప్, స్వీడన్లో కూడా జరుపుకుంటారు.



-కావ్యసుధ
9247313488

## సంక్రాంతి-కొత్త కాంతి

ఆకాశం వాకిళ్ళ మీద
ఇంద్రధనుస్సు రంగులతో,
చుక్కల ముగ్గులు వేయంగా
పచ్చ బంతి పూలు ,కొత్త ధాన్యానికి
హారతి పట్టంగా,
వచ్చింది సంక్రాంతి పండుగ
ఆనందాలను పంచింది నిండుగా.
ఏడు గుర్రాలెక్కిన సూరీడు
తిరిగి తెచ్చిన,ఎర్రని వర్ణం,,
ప్రకృతి కాళ్లకు దిద్దిన
పారాణిలా పూసింది.

పరవశాల ఉదయం
బొట్టుతో మెరిసింది.
నిండు లోగిలి పండు వెన్నెలై
గొబ్బిళ్ళ తో నిండిన వాకిళ్లు
ఎగిరే పతంగులై
హరిదాసు,గంగడోలు ఆశీష్యులతో
భోగిమంటల ఉషస్సులతో
తమస్సును పారద్రోలింది.
నిద్దుర తలపులు వదిలింది
కొత్త బియ్యం పొంగలి రుచి,
కొత్త తోరణాలు ద్వారములకు పేర్చి
పసిడి పంటా,ప్రతి ఇంటా పరిఢవిల్లి,

పశు సంపద పాడితో వర్ధిల్లి.
పందెం కోళ్ల పోట్లాటలు చిందులెయ్యగా
గొబ్బిళ్ళ ఆటలు కనువిందు చెయ్యగా
ఒడిసి పట్టుకుంది సంతసాన్ని సంక్రాంతి,
ఒడిలో ఒదిగింది వెల్లువలా ఒక కొత్త కాంతి



-డా.సముద్రాల శ్రీదేవి
9949837743

## పల్లె సంక్రాంతి

సమస్తమూ కాంతిమయమై
సంక్రాంతి శోభను సంతరించుకొన్న
పల్లె సౌందర్యం
పచ్చని పూబంతులు సొగసు రేకులతో
వయ్యారాలుపోతూ ఇంటి గుమ్మాలకు తోరణాలై
కనుమరుగైపోతున్న సాంప్రదాయపు సంస్కృతిని
ప్రతి ఇంటా ముంగిటా సందడి చేస్తుంది
ధాన్యలక్ష్మి ఇంటికి చేరేవేళ
రైతన్నల కళ్ళల్లో ఆనందం..
గోదాములనిండా సిరులపంట
ముంగిట్లో ముత్యాలు
ముగ్గులేసి-రత్నాల రంగులద్ది
గుమ్మడిపూలు సింగారించుకొన్న గొబ్బిళ్ళు!
కన్నె పిల్లల గొబ్బిపాటలతో రాగరంజితమై
తెలుగుతనం ఉట్టిపడేలా గర్వించే పల్లెదనం
చలిని తరిమేసే భోగిమంటలు
వెచ్చదనంలో వెలుగు సొగసులు
మకర రాశిలో ప్రవేశించిన సూర్యుడు
ఉత్తరాయణ పుణ్యకాలంలో
ఉత్తమ లోక ప్రాప్తిని కలిగించి
స్వచ్ఛంద మరణాన్ని ప్రసాదించే ఒక వరం!
ఆధ్యాత్మిక మార్గానికి బాటలు వేసి
మోక్ష మార్గానికి దారిచూపే కూష్మాండ దానాలు
ముందురోజు భోగి వెనుక కనుమ
మధ్యలో సంక్రాంతిని వెంటబెట్టుకొచ్చి
ఏడాదికో మారు కలుసుకొనే
ఉమ్మడి కుటుంబాలు
బొమ్మల కొలువులు, భోగిపండ్లు పేరంటాలు
పశుల పండుగ పొంగళ్ళు
చిన్నా పెద్దా గాలిపటాల పోటీలతో
కోడిపందాలు, ఎడ్ల పందాలతో
సంక్రాంతి సంబరాలకు పల్లె ముస్తాబైంది.
అరిసెలు, పిండివంటల విందు భోజనాలతో
సంతోషాన్ని పంచుకొని
సంబరంగా జరుపుకొన్న వేడుక
హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు
జంగర దేవర శంఖునాదాలు,
బుడబుక్కాల కళాకారులతో
వీధి వీధి కళ కళలాడే వింత శోభాయమానం
ప్రేమ ఆప్యాయతలతో పాటు
కట్న కానుకలందుకొని
ఆశీర్వచనాలందుకొని-మధుర జ్ఞాపకాలను
మూటగట్టుకొని తిరుగు ప్రయాణాలకు
వీడ్కోలు పలికిపల్లె సంక్రాంతిని స్వాగతిస్తుంది.



-తాటికోల పద్మావతి
సెల్: 94417 53376

## సంక్రాంతి

సూర్యదేవుని మకర రాశి ప్రవేశం..
ఉత్తరక్రాంతి సంక్రాంతి నవక్రాంతి..
ముచ్చటైన మూడు రోజుల పండుగ..
దేవతలు మేలుకునేకాలం..
తేజోప్రకాశం శోభాయం
నేల తల్లిని నమ్ముకున్న
రైతు సేద్యం స్వేదం
ఇల్లుచేరిన సిరిపంటలు
బసవన్నలను ప్రేమించే రైతుకు ఆటవిడుపు..
మూగజీవులకు ముస్తాబులు పూజలు
భోగిమంటలకాంతులు
కొత్తను స్వాగతించే వెలుగులు.
చిన్నారులకు భోగి పళ్ళ దిష్టి స్నానాలు..
ముంగిళ్ళలో
ముచ్చటైన ముగ్గులు.. గొబ్బెమ్మలునవధాన్యాలు.
పట్టు పరికిణి జడ కుచ్చులు..
గాజుల గలగలతో కన్నె పిల్లలు..
పసుపు కుంకుమలు పూలు పూజలు..
"గొబ్బి సుబ్బమ్మ సుబ్బన్నీయ్యవే మొగలిరేకంటి మొగున్నీయవే " అంటూ
కిలకిల నవ్వులు ఆనందాల హరివిల్లులు
అత్తవారింట్లో కొత్త అల్లుళ్ల సందడి..
బావమరదులు మరదళ్ల వేళాకోళాలు..
ఆత్మీయపలకరింపులు. పిండివంటలగుమగుమలు
డోలు సన్నాయిలు గంగిరెద్దులవిన్యాసాలు
కాళ్లకు గజ్జెలు, చేతుల్లో చిరుతలు
రాగి అక్షయపాత్ర
హరిదాసుల హృద్యమైనసంకీర్తనలు
మురిసే మనసులు
పిల్లలకు సెలవులు
ఆకాశవీధిలోవిహారాలు
జిలుగు వెలుగుల గాలిపటాలు..
పాల పొంగులు,కోడి పందాలు, కోలాటాలు,
వనభోజనాలు, బొమ్మల కొలువులు, బొమ్మరిల్లులు,
పితృదేవతలకు, దేవుళ్ళకు పూజలు
ఎవరేవరి పద్ధతులు వారివారివి.
సంస్కృతి సంప్రదాయాలు ఇచ్చిపుచ్చుకునే
మమతలు..ఆరోగ్యం ఆనందం
సంక్రాంతి సంబరాలు.



-గడ్డం సులోచన
7702891559

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com